www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 21 మార్చి 2023
5
వైఎస్ఆర్



ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణకు కృషి : యుటిఎఫ్
కడప అర్బన్ : ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు తమ వంతు కృషి చేయాలని కడప జిల్లా విద్యాశాఖాధికారి వై.రాఘవరెడ్డికి యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎ.లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు విజ్ఞప్తి చేశారు. నూతనంగా కడప జిల్లాకు డిఇఒగా నియామకం పొంది ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన జిల్లా విద్యాశాఖాధికారి వై.రాఘవరెడ్డిని సోమవారం యుటిఎఫ్ నాయకులు ఆయన చాంబర్లో కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ విద్యా రంగాన్ని బలోపేతం చేసేందుకు తమ వంతు కృషి చేయాలని కోరారు. విద్యా శాఖలో వ్యవస్థీకృతంగా ఉన్న లోపాలను సరిదిద్దేందుకు ప్రయ త్నించాలన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి మాట్లాడుతూ తన పరిధిలోని సమస్యలను ఎప్పటికప్పుడూ పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. జిల్లాలో ప్రభుత్వ విద్యా రంగ పని తీరును మెరుగుపరిచేందుకు, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయ సంఘాలు సహకరించాలన్నారు.

మండు వేసవిని అధిగమిద్దాం : కలెక్టర్
ప్రజాశక్తి - కడప


మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్‌రామరాజు

ముందస్తు జాగ్రత్తలతో మండు వేసవిని అధిగమిద్దాం అని, ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా తగు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకునేలా అవగాహన కల్పించాలని. జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని తన చాంబర్లో 'వేసవి వడగాల్పులు, వడదెబ్బ, ముందస్తు జాగ్రత్త చర్యలు'పై జెసి సాయికాంత్‌వర్మతో కలిసి కలెక్టర్ వి.విజయ్ రామరాజు జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ముందస్తుగానే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో దీనిపై ప్రజలు అత్యంత జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రెండు నెలల పాటు ఇదే పరిస్థితి స్పందన ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకునేలా అధికారులు అవగాహన కల్పించాలన్నారు. అందులో భాగంగా ఎంపిడిఓల ఆధ్వర్యంలో అన్ని మండలాల్లో విరివిగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని జడ్‌పి సిఇఒ సుధాకర్ రెడ్డిని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు స్థానిక ఎఎన్ఎంలను సమన్వయం చేసుకుని వడగాల్పులపై ప్రజలకు అవగాహన కల్పించాలని, తగినన్ని ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకునేలా చర్యలు తీసుకోవాలని డిపిఒ ప్రభాకర్ రెడ్డిని ఆదేశించారు. గ్రామీణ ఉపాధి హామీ పనులు జరిగే ప్రాంతంలో షెడ్లు, మంచినీటి సౌకర్యం కల్పించడంతో పాటు తగినన్ని ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని డ్వామా అధికారులను ఆదేశించారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఆయా అంగన్వాడీ వేసవి వడగాల్పుల పై సిడిపిఒ, సూపర్‌వైజర్లు, అంగన్వాడీ వర్కర్ల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలోని అన్ని మున్సి పాలిటీల పరిధిలోని బహిరంగ ప్రదేశాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేసేవిధంగా మున్సిపల్ కమిషనర్లు బాధ్యత తీసుకో వాలన్నారు. 104, 108 మొబైల్ మెడికల్ వాహనాల సేవలను వేసవిలో విస్తృతం చేయాలన్నారు. వడ దెబ్బ, అతి సార లాంటి సమస్యలపై వైద్య ఆరోగ్య సిబ్బంది, అధి కారులు.. వెంటనే స్పందిస్తూ తక్షణ సేవలందించా లన్నారు. ఎన్‌జిఒల భాగస్వామ్యంతో విరివిగా చలివేంద్రాలు ఏర్పాటు చేయం చాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో రద్దీగా ఉండే ట్రాఫిక్ సిగ్నల్స్ దగ్గర గ్రీన్ తెరలను ఏర్పాటు చేయం చాలన్నారు. కార్యక్రమంలో డిఆర్ఓ గంగాధర్ గౌడ్, జడ్పిసి సిఇఒ సుధాకర్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు, ఏపి వివిపి డిసిహెచ్ఎస్ డాక్టర్ హిమదేవి, డిఆర్‌డిఎ, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్లు ఆనంద్ నాయక్, రామ్మో హన్ రెడ్డి, యదుభూషన్ రెడ్డి, ఎం.ఎస్. రాణి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ వీరన్న, అన్ని మున్సిపాలిటీల కమిషనర్లు, అటవీ శాఖ, పబ్లిక్ హెల్త్, ఐసిడిఎస్ అధికారులు, పశుసంవర్థక శాఖ, ఫైర్, పోలీసు అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అంగన్వాడీల ఆగ్రహం
- చలో విజయవాడను అడ్డుకోవడం దుర్మార్గం
- అక్రమ అరెస్టులు అన్యాయం
- ఇచ్చిన హామీలు అమలు చేయాలి
- అంగన్వాడీ యూనియన్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ఐ.ఎన్.సుబ్బమ్మ
- ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ఆందోళన

ప్రజాశక్తి - కడప అర్బన్

తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్తున్న అంగన్వాడీ కార్యకర్తలను పోలీసులు అడ్డుకోవడం దుర్మార్గమని, అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ఐ.ఎన్. సుబ్బమ్మ డిమాండ్ చేశారు. సోమవారం ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీలకు సకాలంలో వేతనాలు బిల్లులు చెల్లించడం లేదని చెప్పారు. తెలంగాణ కన్నా ఎక్కువ వేతనం ఇస్తామని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చెప్పిన జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చి దాదాపు నాలుగు సంవత్సరాలు అవుతున్న ఇంతవరకు హామీ నెరవేర్చకపోవడం దారుణమని వాపోయారు. అంగన్వాడీలకు గ్రాడ్యుటీ ఇవ్వాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వెంటనే అమలు చేయాలని పేర్కొన్నారు. అంగన్వాడీలకు రకరకాల యాప్‌లు ఇచ్చి పని భారం పెంచి పుండు మీద కారం చల్లినట్టుగా ఈ రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని విమర్శించారు. 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న టి ఏ బిల్లులూ ఇంతవరకు చెల్లించకపోవడం శోచనీయమని వాపోయారు. సీనియార్టీ ప్రకారం అన్ని శాఖలో ఉద్యోగోన్నతలు ఇస్తుంటే అంగన్వాడీలకు మాత్రం వయోపరిమితి, పరీక్షలు అనే నిబంధలను పెట్టడం అన్యాయమన్నారు. పల్లెల్లో ఉండే గర్భిణీలకు, చంటి బిడ్డలకు సేవలు చేస్తున్న అంగన్వాడీలను ఇంత ఇబ్బందులకు గురి చేయడం ముఖ్యమంత్రికి తగదన్నారు. కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి పి. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలను రాష్ట్ర ప్రభుత్వం మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తుందని విమర్శించారు. స్కీం వర్కర్లు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కార్మికుల సమస్యలు పరిష్కారం చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. సమస్యలను తక్షణమే పరిష్కారం చేయాలి డిమాండ్ చేశారు. అనంతరం ఆర్‌డిఒ ధర్మచంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. విజయభాస్కర్, కోశాధికారి గోపి, మెడికల్ యూనియన్ నాయకులు పవన్, ఆటో యూనియన్ నాయకులు హిమాం చాంద్ బాషా, మౌలాలి, శేఖర్, అంగన్వాడీ యూనియన్ నాయకులు అంజనీ దేవి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధర్నాలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, సిఐటియు నాయకులు

జమ్మలమడుగు : చలో విజయవాడ కార్యక్రమాన్ని అడ్డుకున్నందుకు నిరసనగా సోమవారం సిఐటియు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనం రూ 26 వేలు అమలు చేయాలని, ముఖ హాజరు రద్దు చేయాలని, పర్యవేక్షణ పేరుతో వేధింపులు ఆపాలని, వైయస్సార్ సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు ఏరియా ఉపాధ్యక్షులు శివ నారాయణ, నాయకులు విజయ్, దాసు, డేవిడ్, వినయ్, ప్రభాకర్, సామి, రవి, ఉస్సేన్, దివాకర్, చిన్న పాల్గొన్నారు.

బద్వేల్ : ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ బద్వేల్ ప్రాజెక్టు కమిటీ ఆధ్వర్యంలో స్థానిక రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కె. నాగేంద్రబాబు, యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి ఆర్. హుస్సేనమ్మ, అంగన్వాడీ వర్కర్లు సుజాత, సుధా, ప్రభావతి, విజయ, శ్రీదేవి, రమాదేవి, కళావతి, కృష్ణవేణి, ఏ. సుజాత, లైసమ్మ, హెల్పర్లు సుప్రజ, ఈశ్వరమ్మ, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని, సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు ఓబులేసు, మహిళా సంఘం నాయకురాలు గౌతమి, అనంతమ్మ, బాలమ్మ, మస్తాన్ బీ పాల్గొన్నారు.

పోరుమామిళ్ల టౌన్ : స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద అంగన్వాడీ టీచర్లు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాసులు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్. భైరవ ప్రసాద్ ప్రాజెక్టు లీడర్లు జ్యోతి, రేణుకా దేవీ, రమణమ్మ, స్వాతి, రోజమ్మ, సుధా, ఫాతిమా, సీపీఎం మండలనాయకులు రవి, శ్రీనివాసులు పాల్గొన్నారు.



జమ్మలమడుగు: అంబేద్కర్ సర్కిల్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన

జిఒ నంబర్ 1ని రద్దు చేసే వరకూ పోరాటం : అఖిలపక్షం
ప్రజాశక్తి -కడప అర్బన్

జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం పౌర హక్కులను భంగం కలిగించే విధంగా రాజ్యాంగ హక్కులను కాలరాసే పుట్టగతులు ఉండవని, ప్రజాస్వామ్యానికి సంకెళ్లు వేస్తే ప్రజలు తిరగబడతారని, రాబోయే ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ప్రజలు ఓడిస్తారని అఖిలపక్ష నేతలు హెచ్చరించారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన జీవో నంబర్ 1 రద్దు చేయాలని అంబేద్కర్ విగ్రహం వద్ద అఖిలపక్ష నాయకులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి అధికారంలోకి వచ్చేందుకు పాదయాత్రలు, ఓదార్పు యాత్రలు, రోడ్ షో లు, రోడ్లపై సభలు, సమావేశాలు, దీక్షలు చేయడం జరిగిందని, జగన్ అధికారంలో ఉంటే ప్రతిపక్షాలు, ప్రజలు చేయకూడదా అని ప్రశ్నించారు. రాజ్యాంగం అందరికీ సమాన హక్కులు కల్పించిందన్న విషయం జగన్మోహన్‌రెడ్డి తెలుసుకోవాలన్నారు. నిరసన కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, తెలుగుదేశం నాయకులు లక్ష్మిరెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయ కులు ఎన్ఎ సత్తార్ సిపిఐ నగర కార్యదర్శి రామమోహన్, హేతు వాద సంఘం జిల్లా కార్యదర్శి సిఆర్వి ప్రసాద్, లోక్ సత్తా జిల్లా అధ్యక్షులు కృష్ణ, ఎంఆర్‌పిఎస్ దస్తగిరి, బి. దస్తగిరి రెడ్డి పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర వజ్రాల దొంగ అరెస్టు : ఎస్‌పి
ప్రజాశక్తి - కడప అర్బన్

రిమ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో వజ్రాలు దొంగిలించిన కేసులో గోవాకు చెందిన అంతర్రాష్ట్ర దొంగ ఇస్మాయిల్ షాకారేను రిమ్స్ పోలీసులు అరెస్టు చేసినట్లు ఎస్‌పి అన్బురాజన్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్ లోని కాన్ఫరెన్స్ హాలులో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.53 లక్షల విలువ చేసే మూడు చిన్న వజ్రాలు, విలువైన ఎల్లో సఫైర్ వజ్రం స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. అలాగే చిన్నచౌక్ పోలీసు స్టేషన్ పరిధిలోని వాటర్ గండి వద్ద ఐదుగురు అంతర్రాష్ట్ర ఎర్ర చందనం స్మగ్లర్లను అరెస్టు చేశారని పేర్కొ న్నారు. వీరి వద్ద నుంచి 11 ఎర్ర చందనం దుంగలు, కారు, 5 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారని చెప్పారు. ఎర్ర చందనం అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 16 మందిపై పిడి యాక్ట్ ప్రయోగించామని పేర్కొన్నారు. నగరంలోని స్మార్ట్ డిజిటల్ కెమెరా షాపులో షట్టర్ పగలగొట్టి దొంగలు చోరీ చేశారని, వాటిని వన్‌టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. రూ.8లక్షల విలువ చేసే సోని, నికాన్, కెనాన్,మావిక్ డ్రోన్ కెమెరాలు, లెన్సులు, గుజాం, మోటార్ బైక్, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారని చెప్పారు. 48 గంటల్లో కేసు చేధించారని పేర్కొన్నారు. సమావేశంలో ఎఎస్‌పి తుషార్ డూడి, కడప డిఎస్‌పి వెంకటశివారెడ్డి, వన్‌టౌన్ సిఐ ఎస్.వి.నాగరాజు, ఎస్ఐ వెంకటరమణ పాల్గొన్నారు.

సాగర్‌కు యునివర్సల్ అచీవర్స్ బుక్ ఆఫ్ వరల్డ్ అవార్డు
బద్వేలు : కడప జిల్లా బద్వేలు వాసి అయిన అఖిల భారతీయ మరాఠా పరిషత్ జాతీయ అధ్యక్షులు బి.ఎస్.ఆర్ సాగర్‌కు ప్రతిష్టాత్మక యూనివర్సల్ అచీవర్స్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్, కన్నడ బుక్ ఆఫ్ రికార్డ్ లో స్థానం లభించింది. కర్ణాటక రాష్ట్ర విజయపుర (బీజాపూర్) నగరం జ్ఞాన యోగాశ్రమం శ్రీ సిద్ధేశ్వర స్వామి ఆశ్రమంలో ఆదివారం నిర్వ హించిన యూనివర్సల్ అచీవర్స్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ చెన్నై, కర్ణాటక బుక్ ఆఫ్ రికార్డ్ ధార్వాడ్ సంయుక్తంగా 20 నిమిషాల 23 సెకనుల పాటు ఏకకాలంలో దేశవ్యాప్తంగా 500 మంది సాహితీ వేత్తలతో నిర్వ హించిన కన్నడ కావ్యం కార్యక్రమంలో ఆయన రికార్డు సాధించారు.

కంప్యూటర్ సైన్స్ పురోగతిపై జాతీయ సమావేశం
కడప అర్బన్ : కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో కళాశాల సిఎస్ఇ విభాగం వారి ఆధ్వర్యంలో కంప్యూటర్ ఇంజినీరింగ్ పురోగతిపై ఒకరోజు 'అడ్వాన్స్ ఇన్ కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్' అనే అంశంపై జాతీ యస్థాయి కాన్ఫరెన్స్ ఆన్‌లైన్ విధానంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా యోగి వేమన విశ్వవిద్యాలయ సిఎస్ఇ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఏ.కృష్ణ మోహన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో స్వీయ అభ్యాసం ఆధారిత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రోబోట్ ఆవిష్కరణలు కల్పించి ప్రజాదరణ పొందగలదని చెప్పారు.

రామకృష్ణారెడ్డికి ఉగాది పురస్కారం
కలసపాడు : మండలంలోని తెలుపాడు గ్రామానికి చెందిన వివేకానంద ఫౌండేషన్ వ్యవస్థాపకుల పాపిజెన్ని రామకృష్ణారెడ్డికి ఉగాది పురస్కారం లభించింది. ఇది బద్వేలు కళా పీఠం వారు ఏటా కళా రంగాలలో ని సంగీతం, సాహిత్యం, సమాజ సేవలో ప్రతిభావంతులైన ముగ్గురిని గుర్తించి ఉగాది రోజున వారికి పురస్కారాలు అందజేస్తారు. అందులో భాగంగానే 13 ఏళ్లుగా పేద విద్యార్థులకు సహాయపడటం, అనాథలకు చేయూతనివ్వటం, అనాథ శవాలకు అంత్యక్రియలు నిర్వహించటం, రక్తదానం చేయడం, మొక్కలు నాటి సంరక్షించటం, నిరాశ్రయులకు వివేకానంద సేవాశ్రమం లో ఆశ్రయం కల్పించడం వంటి సేవలు చేస్తున్నందుకు గాను పాపిజెన్ని రామకృష్ణారెడ్డి కి ఈ పురస్కారం లభించింది. ఈ నెల 22 వ తేదీ ఉగాది పర్వదినాన బద్వేలులో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారుల చేతుల మీదుగా అందుకోనున్నారు.

పోస్టల్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి
ప్రజాశక్తి - కడప అర్బన్


మాట్లాడుతున్న పోస్టల్ అసిస్టెంట్ డైరెక్టర్

కేంద్ర ప్రభు త్వం ప్రజలకు పోస్టల్ ద్వారా అందిస్తున్న వివిధ రకాల సేవలను సద్వి నియోగం చేసుకోవాలని విజయవాడ పోస్టల్ అసి స్టెంట్ డైరెక్టర్ హరిప్ర సాద్ శర్మ కోరారు. సోమవారం కడప హెడ్ పోస్ట్ ఆఫీస్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టల్ అకౌంట్ మేళాను నిర్వహిస్తున్నామని తెలిపారు. అందరికీ అందుబాటులో సేవింగ్ పథకాలు ఉన్నాయని చెప్పారు. అధిక వడ్డీ రేటు ఇస్తున్నామని పేర్కొన్నారు. పోస్టల్ ఇన్సూరెన్స్ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సుకన్య సమృద్ధి యోజన పథకానికి అధిక వడ్డీ ఇస్తున్నామని చెప్పారు. 15 సంవత్సరాలు కట్టిన తర్వాత అమ్మా యి విద్యకు, వివాహానికి ఉపయోగించుకోవచ్చని చెప్పారు. పిఎల్ఐ, ఆర్ఎ ఎల్ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సాధరణ తలఖీల్లో భాగంగా కడపకు వచ్చినట్లు పేర్కొన్నారు. ఈనెల 23, 24 తేదీలలో పిఎల్ఐ మేళా నిర్వహిస్తున్నామని చెప్పారు.

నష్టపోయిన రైతులందరినీ ఆదుకుంటాం : కలెక్టర్
వేంపల్లె : ఈదురు గాలులతో పంటలు నష్టపోయిన రైతులందరినీ ఆదుకుంటామని, ఆర్థిక సహాయం వచ్చేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ విజయ్‌రామరాజు పేర్కొన్నారు. రెండు రోజుల కిందట ఈదురు గాలులతో వేంపల్లెలో దెబ్బతిన్న అరటి, తమలపాకు తోటలను సోమవారం కలెక్టర్ జాయింట్ కలెక్టర్ సాయికాంత్ వర్మతో కలిసి పరిశీలించారు. తమలపాకు తోటల సాగుకు ఎకరాకు రూ. లక్ష పైగా పెట్టుబడి పెట్టామని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కౌలు కార్డులు ఉన్నాయా అని రైతులను కలెక్టర్ అడగ్గా ఎవరికీ లేవని సమాధానమిచ్చారు. పంట నష్టపోయిన ప్రతి రైతు వివరాలను అధికారులు నమోదు చేసి నివేదికను తనకు పంపాలని హార్టికల్చర్, వ్యవసాయ అధికారులను ఆయన ఆదేశించారు. వేంపల్లెలో ఎక్కువగా ఒకే సామాజిక వర్గానికి చెందిన రైతులే తమలపాకు తోటలను సాగు చేస్తారని ఎంపిటిసి సభ్యుడు కటిక చంద్రశేఖర్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. పంట నష్టంపై సిఎం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఆయన వెంట హార్టికల్చర్ జిల్లా అధికారులు, మండల వ్యవసాయ సిబ్బంది, ఉద్యానవన శాఖ సిబ్బంది, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన
చెన్నూరు : మండలంలో అకాల వర్షం కారణంగా పండించిన పంటలు దెబ్బ తినడంతో, కమలాపురం శాసనసభ్యులు పోచం రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం వైసిపి నాయకులు, వ్యవసాయ అధికారులు పరిశీలించారు. మండలంలోని బయనపల్లె, దౌలతాపురం, గుర్రంపాడు గ్రామాలలో అక్కడక్కడా నూగు పంట నష్టం వాటిల్లిందని తెలియజేశారు. సుమారు 40 ఎకరాలలో నువ్వుల పంటకు నష్టం జరిగినట్లుగా వ్యవసాయ అధికారులు అంచనా వేశారని తెలిపారు. గుర్రంపాడు, రామనపల్లె పల్లెలో 39 ఎకరాల లోని దోస పంట కూడా కొంత వరకు నష్టం వాటిల్లినట్లు గుర్తించామన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ జి.ఎన్. భాస్కర్ రెడ్డి, జడ్‌పిటిసి ముదిరెడ్డి దిలీప్ రెడ్డి, ఎంపీపీ వీరల సురేష్ యాదవ్ మండల అగ్రికల్చర్ అడ్వైజర్ మెంబర్ ఎర్ర సాని మోహన్ రెడ్డి, బయనపల్లె సర్పంచ్ తంగా చంద్రశేఖర్ యాదవ్, మండల అగ్రికల్చర్ అడ్వైజర్ బోర్డ్ మెంబర్ వెంకటసుబ్బారెడ్డి, వివిఎ చరణ్ కుమార్ రెడ్డి, విహెచ్‌ఎ ప్రెన్సీ, రైతులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు సిగ్గుచేటు : టిడిపి
కడప : అక్రమ అరెస్టులు సిగ్గుచేటని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ, టిడిపి ఇన్‌ఛార్జి అమీర్ బాబు అన్నారు. సోమవారం మంగళగిరిలో రాయలసీమ టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, పార్టీ ముఖ్య నాయకుల సమావేశానికి బయలు దేరిన తమను పోలీసులు అక్రమంగా రాళ్లపల్లి టోల్‌ప్లాజా వద్ద అదుపులోకి తీసుకుని పామూరు స్టేషన్‌కు తరలించడం దారుణమని పేర్కొన్నారు. ఇది చేతగాని ప్రభు త్వానికి నిదర్శనమని ఆవేదన వ్యక్తంచేశారు. అక్రమ అరెస్టులతో టిడిపి భయపడదని వారన్నారు.


టిడిపి సభ్యుల తీరు అనాగరికం
కడప : శాసనసభలో టిడిపి సభ్యుల తీరు అనాగరికంగా ఉందని వైసిపి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ వినోద్ కుమార్ అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డారు. శాసనసభలో తెలుగుదేశం సభ్యులు ప్రవర్తన చాలా దుర్మార్గంగా ఉందని, చంద్రబాబు డైరెక్షన్‌లోనే ఇలా దాడులు చేస్తున్నారని పేర్కొన్నారు. వారి దాడిలో దళి తుడైన సంతనూతలపాడు ఎమ్మెల్యే సుధాకర్ బాబు గాయపడడం చాలా బాధాకరం అన్నారు. దాడులు చేసిన టిడిపి వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని, రాబోయే రోజులలో దళితులంతా చంద్రబాబుకు తగిన బుద్ధి చెబుతారని తెలిపారు. విలేకరుల సమావేశంలో మార్కెట్ యార్డ్ డైరెక్టర్ పలకొండ సంపత్. పాల్గొన్నారు.

యువత చేతిలోనే దేశ భవిష్యత్
వల్లూరు : యువత చేతిలోనే మన దేశ భవిష్యత్ ఆధారపడి ఉందని తెలుగు నాడు ప్రజా సేవ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తెలుగు దేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి కాశీ భట్ల సత్య సాయినాథ్ శర్మ అన్నారు. సోమవారం వల్లూరు మండలం అల్లంత ఒబాయపల్లి వద్ద వికె ఆర్మీ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ పోటీల సందర్భంగా బహుమతుల ప్రధానోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన వల్లూరు మండల యువకులు మంగళ వాయిద్యాలతో గజమాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సాయినాథ్ శర్మ మాట్లాడుతూ యువకులు కలిసి కట్టుగా ఐక్యమత్యంగా ఎటువంటి విభేదాలు ఇవ్వకుండా క్రీడా స్ఫూర్తిని చాటడం అభినందనీయమన్నారు. క్రికెట్ పోటీలలో ప్రథమ బహుమతి పొందినజట్టుకు రూ. 50 వేలు, రన్నర్స్‌గా నిలిచిన జట్టుకు రూ. 30 వేలు అందజేశారు. కార్యక్రమంలో వల్లూరు మండల యువజన నాయకులు అశోక్, సతీష్, వివేకానంద హైస్కూల్ కరస్పాండెంట్ రామ సుబ్బారెడ్డి, రైతు సంఘం నాయకులు కల్లూరు జనార్దన్ రెడ్డి, మాజీ సర్పంచ్ సుధాకర్ ,ఆదాలు రాజా, సిద్దారెడ్డి , లింగాల, వెంకటరమణ ,రమణారెడ్డి, అంకిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

డిప్యూటీ సిఎంకు కృతజ్ఞతలు
కడప అర్బన్ : సయ్యద్ కార్పొరేషన్ అమలు చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ సయ్యద్ సంక్షేమ సంఘం సభ్యులు సయ్యద్ గౌస్ పీర్ సోమవారం విజయవాడలోని డిప్యూటీ సిఎం అంజాద్‌బాషాను కలిసి ఘనంగా సన్మానించి, కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోని సయ్యద్ సాదాత్, పలు దర్గా పీఠాధిపతులు, మత గురువులు పాల్గొని రాష్ట్ర ముఖ్యమంత్రి, ప్రభుత్వానికి ధన్యవాదములు తెలుపుతూ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కడప నగరానికి చెందిన సయ్యద్ సంక్షేమ సంఘం సభ్యులు, పీస్ ఇస్లామిక్ ఇంటర్నేషనల్ హై స్కూల్ చైర్మన్ సయ్యద్ గౌస్ పీర్, రాష్ట్ర అధ్యక్షులు హజరత్ ఖలీల్ అహ్మద్ రజ్వి సయ్యద్, నూర్ బాబా సాహెబ్, కొండపల్లి దర్గా హజరత్ అల్తాఫ్ బాబా సాహెబ్ ,సయ్యద్ సంక్షేమ సంఘానికి అభినందిస్తూ, శుభకాంక్షలు తెలిపారు.


అంజాద్‌బాషకు కృతజ్ఞతలు తెల్పుతున్న గౌస్‌పీర్

సిఎంను కలిసిన ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి
కడప అర్బన్ : అసెంబ్లీలోని సిఎం ఛాంబర్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ని నూతన ఎమ్మెల్సీలుగా ఎన్నికైన ఎం.వి రామచంద్రారెడ్డి, ఎ.మధుసూదన్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వీరితోపాటు ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు కల్పలతారెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఉన్నారు.


సిఎంను మర్యాదపూర్వకంగా కలిసిన రామచంద్రారెడ్డి

యుద్ధప్రాతిపదికన రైతులను ఆదుకోవాలి : పిసిసి
ప్రజాశక్తి - కడప


మాట్లాడుతున్న తులసిరెడ్డి

శుక్ర,శని వారాల్లో వీచిన పెను గాలులకు కురిసిన వడగండ్ల వానకు జిల్లాలో అపార నష్టం సంభ వించిందని, ప్రభుత్వం బాధిత రైతులను యుద్ధప్రాతిపదికన ఆదుకోవాలని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేంపల్లి, వీరప నాయుని పల్లి, చక్రాయపేట, పెండ్లిమర్రి, లింగాల, ముద్దనూరు, చాపాడు, పెద్దమడియం, కాజీపేట, మైలవరం, చింతకొమ్మదిన్నె, ఎర్రగుంట్ల, తదితర మండలాల్లో అరటి, మామిడి, చిని, బొప్పాయి, మునగ, ఉల్లి, మిరప, టమోటా, బీర, బెండ, వరి, మొక్కజొన్న, కలింగర, దోస తదితర పంటలు పూర్తిగా దెబ్బతి న్నాయని చెప్పారు. జిల్లా అధికార యంత్రాంగం నామ మాత్రంగా పంట నష్ట లెక్కింపు చేయడం దురదృష్టకరం అన్నారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలో అపార నష్టం వాటిల్లితే రాష్ట్ర సమాచార శాఖ మంత్రి వేణుగోపాల్ కృష్ణ జిల్లాలో జరిగిన నష్టం గురించి ప్రస్తావిం చకపోవడం శోచనీయమని వాపోయరు. వ్యవసాయ మీటర్లు రైతుల మెడకు ఉరి తాళ్లు అవుతాయని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు వైసిపి ప్రభుత్వం పట్ల విద్యావంతుల్లో ఉన్న వ్యతిరేకతను స్పష్టం చేసిందని, అంతమాత్రాన టిడిపికి అనుకూలమని ఆ పార్టీ వారు సంకలు గుద్దుకోవడం హాస్యాస్పదమని తెలిపారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుమలేష్, జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్యామల దేవి, ప్రధాన కార్యదర్శి ప్రసాద్ గౌడ్, సూర్యుడు, కనతల ప్రసాద్, ఉత్తన్న, అమర్నాథ్ రెడ్డి, శివ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రైతు బజార్‌లో అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలి
కడప అర్బన్ : కడప రైతు బజార్‌లో రసీదులు ఇవ్వకుండా కూరగాయల అంగళ్ల దగ్గర, ఎర్రగడ్డల స్టాల్స్ బాడుగలు వసూలు చేయడంలో చోటు చేసుకుంటున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ స్పందనలో జాయింట్ కలెక్టర్ సాయి కాంత్ వర్మకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా దస్తగిరి రెడ్డి మాట్లాడుతూ ఏడాదిగా రైతు బజార్‌కు ఎస్టేట్ ఆఫీసర్ లేకపోవడంతో రైతు బజార్ సిబ్బంది బాడుగలు రసీదులు ఇవ్వకుండా వసూలు చేశారని చెప్పారు. కొత్తగా ఎస్టేట్ ఆఫీసర్ వచ్చారని, ఆయనకు అవగాహన తక్కువ ఉండడంతో సీనియర్లుగా ఉన్న రైతు బజార్ సిబ్బంది అన్ని విషయాల్లో చక్రం తిప్పుతున్నారని చెప్పారు. జాయింట్ కలెక్టర్ స్పందిస్తూ కడప మార్కెటింగ్ ఎడియం వీటిపై సమగ్ర సమాచారం సేకరించి నివేదిక తయారుచేసి రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు.


టిడిపి అధికారంలోకి రావడం ఖాయం
కడప అర్బన్ : ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు టిడిపి అభ్యర్థులను గెలిపించారని, సార్వత్రిక ఎన్నికల్లోనూ ప్రజలకు టిడిపిని బ్రహ్మరథం పడతారని, అధికారంలోకి రావడం ఖామని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు పేర్కొన్నారు. సోమవారం తెలుగు యువత రహీమాన్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలదాసు మాట్లాడుతూ టిడిపి అభ్యర్థులు గెలవకుండా వైసిపి ప్రభుత్వం ఎన్నో ఆటంకాలు కల్పించిందని పేర్కొన్నారు. వీటిని అధిగమించి అభ్యర్థులు గెలుపొందారని తెలిపారు. రామగోపాల్ రెడ్డికి డిక్లరేషన్ ఫామ్ ఇవ్వకుండా ఇబ్బందికి గురి చేశారని విమర్శించారు. పోలీసులను మోహరించి భయభ్రాంతులకు గురిచేయాలని కుట్రపన్నారని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పాలన పట్ల ప్రజలు అసంతృప్తితో ఉన్నారని పేర్కొన్నారు. సమావేశంలో ఇమ్రాన్, రియాజ్ పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ నిధుల కోసం పోరాటం
- పంచాయతీరాజ్ ఛాంబర్ జాతీయ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి - కడప అర్బన్

గ్రామపంచాయతీ నిధుల కోసం సర్పంచులు ఆందోళన బాట పట్టనున్నారని పంచాయతీరాజ్ ఛాంబర్ జాతీయ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్, సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మీ పేర్కొన్నారు. సోమవారం శ్రీనివాస రెసిడెన్సిలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని పార్టీలకు చెందిన సర్పంచులు 12,918 మంది ఉన్నారని తెలిపారు. గ్రామపంచాయతీ నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించడాన్ని ఖండిస్తూ ఉన్నారని చెప్పారు. నిధులు లేక అభివృద్ధి ఆగిపోయిందని పేర్కొన్నారు. ప్రజలకు కావాల్సిన కనీస వసతులు కల్పించడంలో సర్పంచులు నిధులు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సర్పంచులు ఉత్సవ విగ్రహాలుగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకపోగా, కేంద్రం ఇచ్చిన రూ. 8,660 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిందని విమర్శించారు. నిధులు ఇవ్వమని అడిగితే విద్యుత్ బకాయిలకు జమ చేశామని చెప్పడం సిగ్గుచేటు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రత్యేక జీవో విడుదల చేసి ప్రజల నుంచి వస్తున్న పన్నులను కూడా కాజేస్తోందని విమర్శించారు. పంచాయతీ నిధులతోనే రాష్ట్ర ప్రభుత్వం బతుకుతూ ఉందని పేర్కొన్నారు. సీఎం జగన్మోహన్ రెడ్డి వారానికి ఒక బటన్ నొక్కుతూ పంచాయతీ నిధులను దుర్వినియోగం చేస్తు న్నారని విమర్శించారు. మార్చి 31 లోపు రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు నిధులు ఇవ్వకపోతే ఆందోళన, ఉద్యమాలు, పోరాటాలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మునిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండారెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్, రాయలసీమ ఉమ్మడి నాలుగు జిల్లాల సర్పంచులు హాజరయ్యారు.

నోటి ఆరోగ్యంపై అవగాహన
ప్రజాశక్తి-కడప సిటీ


అవగాహన కార్యక్రమంలో వైద్యులు

ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం రిమ్స్ దంత వైద్య కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వ హిం చారు. ఇందులో భాగంగా ఓరల్ కేన్సర్ స్క్రీనింగ్ క్యాంపులు, ఓరల్ బ్రషింగ్, నోటి కేన్సర్ నివారణపై అవ గాహన పొగాకు నమలడం వల్ల కల్గే నష్టాలు వంటి వాటిపై వైద్యులు అవగాహన కల్పించారు. పిల్లలకు బ్రష్ చేయడంలో మెలకువలను వివరించి ప్రజలకు పాంప్లెట్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ జ్యోత్స్న, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్వేత, డాక్టర్ నారాయణరెడ్డి, డాక్టర్ విజయలక్ష్మి, రాఖీజ్, డాక్టర్ నరేంద్రదేవ్ పాల్గొన్నారు.

ఇంటర్‌లో 9 మంది డీబార్
కడప అర్బన్ : ఇంటర్ మొదటి సంవత్సరం మ్యాథమెటిక్స్, బాటని, సివిక్స్ పరీక్షలు సోమవారం నిర్వహించారు. రాయచోటిలోని వేర్వేరు కేంద్రాలలో మ్యాథమెటిక్స్ పరీక్షలో 8 మందిని, బద్వేల్ పరీక్ష కేంద్రంలో ఒకరిని ఫ్లయింగ్ స్క్వాడ్ 9 మంది డీబార్ అయ్యారు. 24,255 పరీక్షలకు హాజరయ్యారు. ఇంటర్మీడియట్ బోర్డ్ నుంచి పరిశీలకులుగా రమణ గుప్తా హాజరై జమ్మలమడుగులో పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

ప్రతి గ్రామంలోనూ ఫ్యామిలీ ఫిజీషియన్
కాశినాయన : మండలంలోని ప్రతి గ్రామంలోనూ ఫ్యామిలీ ఫిజీషియన్‌ను ఏర్పాటు చేశామని వైద్యాధికారి డాక్టర్ స్రవంతి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రమైన నరసాపురం, మూలపల్లె, మిద్దెల గ్రామాల్లో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి ఇంటికి వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంద ద్వారా ఇంటి వద్దకే వైద్యం అందుతుందని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.


దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న ముని రాజారెడ్డి, అధికారులు

రైతులకు నష్టపరిహారం అందేలా చూడాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

మండలంలోని అరవేటిపల్లె, చింతకుంట గ్రామాల్లో దెబ్బతిన్న మొక్కజొన్న, కొర్ర, అరటి, బొప్పాయి పంటలకు నష్టపరిహారం అందేలా చూడాలని మాజీ ఎంపిపి మునిరాజారెడ్డి, వైసిపి మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి అధికారులను కోరారు. వారు సోమవారం వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు వెంకటసుబ్బయ్యతో కలిసి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ముని రాజారెడ్డి మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా ప్రభుత్వానికి నివేదికను అందజేయాలని అధికారులను కోరారు. ఎడిఎ, ఎఒ వెంకటకృష్ణారెడ్డి మాట్లాడుతూ దెబ్బతిన్న పంటల వివరాలను సర్వే నంబర్ల వారీగా పరిశీలించామన్నారు. రెవెన్యూ శాఖ సమన్వయంతో పంట నష్టం అంచనా వేసి ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వానికి నివేదికలను పంపిస్తామన్నారు. పంట నష్టపోయిన రైతులు తమ వివరాలు అందించాలన్నారు. మండలంలో 340 ఎకరాల్లో వ్యవసాయ పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న టిడిపి నాయకులు

ఖాదర్‌పల్లెలో టిడిపి సంబరాలు

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని ఖాదర్‌పల్లెలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి బి.రాంగోపాల్‌రెడ్డి ఘన విజయం సాధించడంతో ఎన్ఆర్ఐ టిడిపి కువైట్ హవల్లి గవర్నరేటర్ మైనారిటీ విభాగం కో-ఆర్డినేటర్ టి.అబ్దుల్ కరీం ఆధ్వర్యంలో సోమవారం కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రావడానికి ఆరంభమైందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు నాయబ్ రసూల్, మహమ్మద్, బాషా, రహమత్ అలీ, ఫకృద్దీన్, అబ్దుల్ రసూల్, సుబ్బారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో విరిగిన పైపులు

ప్రజాశక్తి - వేంపల్లె



రాజీవ్‌నగర్ కాలనీ సమీపాన జగనన్న కాలనీల్లో తాగునీటి పైపులు పగిలి పోయాయి. ఇంటి నిర్మాణాలు చేపట్టే లబ్ధిదారులు నీటి కోసం అవస్తలు పడుతున్నారు. అంతేకాక కరెంటు కూడా సరైన సమయంలో సరఫరా కాకపోవడంతో ఇంటి నిర్మాణాలు చేపట్టేందుకు నీటీ కోసం డబ్బులు ఖర్చు చేస్తున్నారు. ఓ వైపు సకాలంలో ఇంటి నిర్మాణాలు చేపట్టాలని అధికారులు లబ్ధిదారులపై ఒత్తిడి తేస్తున్నారు. మరో వైపు ఇంటి నిర్మాణాలు చేపట్టాలంటే నీరు సరఫరా కావడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు లబ్ధిదారుల నీటి కష్టాలను తీర్చి, సకాలంలో ఇళ్లు నిర్మించుకునేలా సహకరించాలని కోరుతున్నారు. దెబ్బతిన్న పైపులైన్లకు మరమ్మతులు చేయాలని, నీటి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

శిల్పారామంలో విభిన్న సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ఉగాది, శ్రీరామనవమి పండుగల సందర్భంగా ఈనెల 22, 23, 30వ తేదీల్లో శిల్పారామంలో విభిన్న సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శిల్పారామ పరిపాలనాధికారి సుధాకర్ సోమవారం తెలిపారు. ఆ మేరకు శిల్పారామంలో ఆయన విలేకరుల సమావేశంలో సిబ్బందితో కలిసి కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం సుధాకర్ మాట్లాడుతూ 22న ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని సందర్శకులకు ఉగాది పచ్చడి పంపిణీ చేస్తామన్నారు. పలు కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేశామన్నారు. శ్రీరామనవమి పండుగ సందర్భంగా వడపప్పు, పానకం పంపిణీ చేస్తామన్నారు. ఆయా కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆయన కోరారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సిబ్బంది

క్రైం కార్నర్


దుంగలు, స్మగ్లర్లతో అధికారులు

23 ఎర్రచందనం దుంగలు పట్టివేత

- ఐదుగురు అరెస్టు, కారు, బైక్ స్వాధీనం

ప్రజాశక్తి - పోరుమామిళ్ల

అటవీ రేంజ్ పరిధిలో 23 ఎర్రచందనం దుంగలను, ఐదుగురు స్మగ్లర్లను అధికారులు అరెస్టు చేశారు. వారి నుంచి కారు, బైక్‌ను టాస్క్ ఫోర్సు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఎస్‌పి కె.చక్రవర్తి ఆదేశాల మేరకు ఆర్ఐ చిరంజీవి, ఆర్ఎస్ఐ రాఘవేంద్ర బృందం పోరుమామిళ్ల అటవీ రేంజ్‌లోని టేకూరుపేట మీదుగా కవలకుంట్ల ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. కవలకుంట్ల గ్రామానికి సమీపంలో ఒక కారు, బైక్ ఉంది. అక్కడకు వెళ్లి చూడగా కారులో దుంగలను లోడ్ చేస్తూ స్మగ్లర్లు కనిపించారు. వారిని చుట్టుముట్టే ప్రయత్నం చేయగా దుంగలను పడేసి పారిపోయారు. వారిలో ఐదుగురిని పట్టుకోగలిగామమని అధికారులు తెలిపారు. అరెస్టు చేసినవారిలో పోరుమామిళ్ల పట్టణానికి చెందిన పాలగిరి నాగార్జున, పెద్దేటి నాగరాజు, గుజ్జుల వెంకటేశ్వర్లు, చినమల వెంకటయ్య, పులివెందులకు చెందిన నీరెద్దుల ప్రకాష్‌గా గుర్తించారు. వీరి నుంచి 23 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. కేసును తిరు పతి టాస్క్‌ఫోర్సు పోలీసుస్టేషన్‌లో నమోదు చేయగా, సిఐ బాలకృష్ణ దర్యాప్తు చేస్తున్నారు.

రక్షణలేని 'కుందూ' పాత వంతెన


కుందూ నదిపై ప్రమాదకరంగా ఉన్న అల్లాడుపల్లె పాత వంతెన

ప్రజాశక్తి - చాపాడు

అల్లాడుపల్లె-సీతారామపురం గ్రామాల మధ్య కుందు నదిపై ఉన్న పాత వంతెనకు రక్షణ కరువైంది. వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కొంతమంది వంతెనపై నుండి అదుపు తప్పి పడి ప్రాణాలను వదులుతున్నారు. గతంలో అల్లాడుపల్లె గ్రామానికి చెందిన మహేష్ అనే వ్యక్తి స్కూటర్ అదుపుతప్పి నదిలో పడి మృతి చెందాడు. వంతెనపై ఇరువైపులా రక్షణకు ఎలాంటి ఏర్పాటు లేదు. వంతెనపై ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మెలు అరకొరగా మాత్రమే ఉన్నాయి. ఇవి ఏమాత్రం ప్రయాణికులకు రక్షణను ఇవ్వడం లేదు. ఈ వంతెన మీద అల్లాడుపల్లె, చిన్న గురువలూరు, పెద్ద గురువలూరు, శ్రీరాములపేట వంటి గ్రామాల ప్రజలు నిత్యం ప్రయాణిస్తుంటారు. ఆర్‌టిసి బస్సులు, ఆటోలు, అవసరాల నిమిత్తం ద్విచక్రవాహనాల్లో ప్రజలు ప్రొద్దుటూరుకు వెళుతుంటారు. వంతెన ప్రయాణం భయాందోళనగా ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా వంతెనపై రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం


రక్షణ గోడకు నోచుకోని కల్వర్టు

ఖాజీపేట : ఇటీవలి కాలంలో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. మితిమీరిన వాహనాల వేగం ఒక కారణమైతే, రహదారులు సక్రమంగా లేకపోవడం, రహదారులపై నిర్మించిన వంతెనలకు ఇరువైపులా రక్షణ గోడలు లేకపోవడం కారణాలు. రహదారుల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నా, సమస్యలు మాత్రం అలాగే ఉన్నాయి. కల్వర్టులు, వంతెనల మరమ్మతులను అధికారులు పట్టిం చుకోవడంలేదని ఆరోపణలున్నాయి. దీంతో పలు ప్రమాదాలు జరు గుతున్నాయి. మండల పరిధిలోని చెముళ్లపల్లి గ్రామం నుంచి ములపాకు వెళ్లే మార్గంలో రహదారిపై నిర్మించిన కల్వర్టుకు ఇరువైపులా రక్షణ చర్యలు కరువయ్యాయి. వర్షాకాలంలో వంతెన ద్వారా నీటి ప్రవాహం అధికంగా ఉంటుంది. ఆ సమయంలో రాకపోకలు సాగించాలంటే కష్ట తరంగా ఉంటుంది. పత్తూరు సమీపంలోని బెస్త కాలనీ వద్ద కడప కెళ్లే ప్రధాన రహదారిపై నిర్మించిన కల్వర్టుకు ఇరువైపులా రక్షణ గోడలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ మార్గంలో వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. వాహనాల రాకపోకల సమయంలో వాహనాలు అదుపు తప్పి నీటి వాగులో పడే ప్రమాదం లేకపోలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారులపై నిర్మించిన కల్వర్టులకు ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించి, ప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

భూమిరెడ్డి ఎన్నిక ఓటర్ల గెలుపు : మాజీ ఎమ్మెల్సీ



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పట్టభద్రుల ఎమ్మెల్సీగా భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి ఎన్నిక నిజంగా ఓటర్ల విజయమని మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ముందుగా భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. గతంలో జరిగిన ఎన్నికల్లో ఇలా పట్టభద్రులు ఓటు వేయడానికి రాలేదన్నారు. జమ్మలమడుగులో దాదాపు 76శాతం మంది ఓటర్లు హాజరుకావడం విశేషమన్నారు. ప్రభుత్వంపై వ్యతిరేకతను ఎంతో ఉన్నతంగా ఓటు రూపంలో చూపించారన్నారు. భూమిరెడ్డి గెలుపులో జమ్మలమడుగు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారన్నారు. భూపేష్‌రెడ్డి మాటకు విలువ ఇచ్చి ప్రతి కార్యకర్త ఓటర్ల జాబితా చేత పట్టుకొని ఒకటికి రెండుసార్లు తిరిగి ఓటు వేయించడంలో వారి కృషి వెలకట్టలేనిదన్నారు. గెలిచిన ఎమ్మెల్సీ సభ్యులు చిత్తశుద్ధితో పని చేసి ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. 2024 ఎన్నికల్లో టిడిపి జెండా జమ్మలమడుగు, రాష్ట్రంలో ఎగిరేలా ప్రతి ఓటరు కృషి చేయాలన్నారు. శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించిన ఎస్‌పి, జమ్మలమడుగు డిఎస్‌పి నాగరాజు, ఆర్‌డిఒ శ్రీనివాసులు, పోలీసు సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు. ఎన్నికల్లో కీలక ఓట్లుగా మారిన సిపిఎం, సిపిఐ వాటి అనుబంధ సంఘాల, కుల, మత సంఘాల వారికి కృతజ్ఞతలు తెలిపారు. అసెంబ్లీలో టిడిపి ఎమ్మెల్యేల పట్ల దురుసుగా ప్రవర్తించడం అప్రజాస్వామికమని, పూర్తిగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాజగోపాల్‌రెడ్డి, అలీ, శ్రీనివాసులురెడ్డి, భూసిరెడ్డి పాల్గొన్నారు.

అమృత్‌నగర్‌లో కనీస వసతులు కల్పించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక కొత్తపల్లి పంచాయతీలోని అమృత్‌నగర్‌లో రోడ్లు, మంచినీరు, కరెంటు వంటి కనీస వసతులు కల్పించాలని ఐద్వా ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు. కొత్తపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళననుద్దేశించి ఐద్వా జిల్లా కార్యదర్శి ముంతాజ్, ప్రొద్దుటూరు కార్యదర్శి వెంకటసుబ్బమ్మ మాట్లాడుతూ అమృత్‌నగర్‌లో కొన్ని వీధుల్లో మంచి నీటి కుళాయిలలో మురికి నీరు చేరిందన్నారు. మరి కొన్నిచోట్ల మంచినీరు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అడ్డ రోడ్లు వేయకపోవడం వల్ల దాదాపుగా రెండు అడుగుల నీరు నిలువ చేరి ఇళ్లల్లోకి వస్తున్నాయన్నారు. వెంటనే రోడ్లు వేయాలని కోరారు. విద్యుత్ స్తంభాలు చాలా చోట్ల ఒరిగిపోయి ఉన్నాయని తెలిపారు. కొన్ని ఇళ్లపై లైన్లు ఉన్నాయని, వాటిని వెంటనే సరిచేయాలన్నారు. సమస్యలపై సర్పంచు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి వెంటనే స్పందించారు. విద్యుత్ అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని చెప్పారన్నారు. మురికి నీటిని తొలగించి మట్టి తోలి ఎత్తుగా చేస్తామని హామీ ఇచ్చారన్నారు. వారంలోపు సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. ధర్నాలో సిపిఎం కార్యదర్శి సత్యనారాయణ, శేఖర్, మహిళా సంఘం నాయకులు రాములమ్మ, శారద, శశిరేఖ, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న ఐద్వా, సిపిఎం నాయకులు

భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న భూములు కోల్పోతున్న రైతులు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలో నూతనంగా నిర్మాణం చేపట్టనున్న గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేలో భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం నుంచి న్యాయం జరిగేలా చూడాలని కేతవరం గ్రామ రైతులు సోమవారం కడప కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ నేషనల్ హైవేకు సమీపాన ఉన్న భూములకు ఎకరాకు రూ.24 లక్షలు, కాస్త లోపలికి ఉన్న భూములకు రూ.15 లక్షలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. హైవేలో భూములు కోల్పోతే జీవనాధారం పూర్తిగా కోల్పోతామని, ప్రభుత్వం రైతులకు మరింత న్యాయం చేయాలన్నారు. ఇప్పటికే తహశీల్దార్, ఆర్‌డిఒకు గ్రామ సభలలో అర్జీలను అందించామని తెలిపారు. వారి నుంచి ఎలాంటి హామీ లేదన్నారు. ఇప్పటికైనా జాతీయ రహదారులకు భూములు కోల్పోతున్న రైతులకు మార్కెట్‌లో ఉన్న ధరకు అనుగుణంగా నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరుతు న్నామన్నారు. కార్యక్రమంలో భూములు కోల్పోతున్న రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలి

ప్రజాశక్తి - చాపాడు


విద్యార్థులతో కలిసి అన్నం తింటున్న అధికారులు

పదవ తరగతి, ఇంటర్ విద్యార్థులు పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని పాఠశాలల రాష్ట్ర కార్యదర్శి మధు సూదనరావు తెలిపారు. స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను సోమవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. జిల్లా సమగ్ర శిక్ష అధికారి ప్రభాకర్‌రెడ్డితో కలిసి పాఠశాలలో మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మెనూ ప్రకా రం భోజనం అందుతుందా లేదా అని విద్యార్థులను అడిగి తెలు సుకున్నారు. అనంతరం సిలబస్‌పై సిబ్బందికి పలు సూచనలు చేశారు. రికా ర్డులను, విద్యార్థుల హాజరును పరిశీలించారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని విద్యార్థులకు అడిగారు. కార్యక్రమంలో ఎంఇఒ రవిశంకర్, పాఠశాల ప్రత్యేక అధికారి నాగలక్ష్మి, ఎంఆర్‌సి కార్యాలయ సిబ్బంది మహేష్, శ్రీను పాల్గొన్నారు.

దెబ్బతిన్న ఇళ్లకు పరిహారం ఇవ్వాలి

ప్రజాశక్తి - వేంపల్లె

అకాల వర్షం, ఈదురు గాలులకు దెబ్బతిన్న ఇళ్లకు ప్రభుత్వం నష్టపరిహారం అందజేయాలని టిడిపి మైనార్టీ మండల కన్వీనర్ తెలంగాణ వలి కోరారు. సోమవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెండు రోజుల క్రితం ఈదురు గాలులతో బిడాలమిట్టకు చెందిన గంగాదేవి, చాంద్ ప్యారీకి చెందిన ఇళ్లు దెబ్బతిన్నాయన్నారు. రెవెన్యూ అధికారులు సర్వే చేసి పరిహారం మంజూరయ్యేలా కృషి చేయాలని సూచించారు.

నిర్బంధించడం అప్రజాస్వామికం : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ నంబర్ వన్‌ను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ విద్యార్థి, యువజన సంఘాలు తలపెట్టిన ఛలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళ్లకుండా ఆంక్షలతో నిర్బంధించడం అప్రజాస్వామికమని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఆంక్షలతో పోలీసులు ముందస్తు నోటీసులు ఇచ్చి, అసెంబ్లీకి వెళ్లనీయకుండా అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. విద్యార్థి, యువజన, ప్రజా, కార్మిక సంఘాల సమస్యలపై రోడ్లపైకి వచ్చి నిరసనలు, ర్యాలీలు చేయకూడదని, కలెక్టరేట్, ఆర్‌డిఒ, తహశీల్దార్ కార్యాలయాల వద్ద కూడా ప్రజా సమస్యలపై నిరసన తెలిపేందుకు ప్రస్తుత ప్రభుత్వం అడ్డుకుంటోందన్నారు. జిఒ వన్ తెచ్చి ప్రజా ఉద్యమాలను అణిచి వేస్తున్నారన్నారు. నిరసనలు తెలిపే హక్కు భారత రాజ్యాంగం కల్పించిందని ఆయన తెలిపారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మొండి వైఖరి విడనాడాలన్నారు. ప్రజా హక్కులను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి షాకీర్, జిల్లా ఉపాధ్యక్షులు డేవిడ్‌రాజ్ పాల్గొన్నారు.


రాంగోపాల్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న చంద్రబాబు

చంద్రబాబును కలిసిన ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏడువేలకుపైగా మెజార్టీతో వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిపై విజయం సాధించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి సోమవారం మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా రాంగోపాల్‌రెడ్డికి చంద్రబాబు శాలువా కప్పి పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జరిగిన ఎన్నికల ప్రక్రియ గురించి అడిగి తెలుసుకున్నారు. రాబోయే రోజుల్లో ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసేలా చూసుకోవాల్సిన బాధ్యత మరింత పెరిగిందన్నారు. కార్యక్రమంలో అచ్చెన్నాయుడు, కడప జిల్లా నాయకులు శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

దంతాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు



దంతాలను పరీక్షిస్తున్న డాక్టర్ మహబూబ్ బాషా

విద్యార్థులు చిన్ననాటి నుండే దంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని దంత వైద్య నిపుణులు మహబూబ్ బాషా సూచించారు. ప్రపంచ ఓరల్ హెల్త్ డే సందర్భంగా మండల పరిధిలోని లక్ష్మీపేట ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు జవహర్ మునీర్ ఆధ్వర్యంలో దంత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ప్రతిరోజు దంతాలను శుభ్రం చేసుకోవాలన్నారు. ఏవైనా పదార్థాలు తినగానే దంతాలను శుభ్రం చేసుకునే అలవాటు చేసుకోవాలన్నారు. దంతాలను శుభ్రంగా ఉంచుకోవడం వలన నోటి క్యాన్సర్‌ను నివారించవచ్చు అన్నారు. దంత సమస్య ఏర్పడితే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. దంత సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు పూర్తి అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు పేస్టు, బ్రష్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రభావతి, సిఆర్‌పి అంజనాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

నారా లోకేష్‌ను కలిసిన నాయకులు

ప్రజాశక్తి - ఖాజీపేట

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్‌లో యువగళం పాదయాత్రలో సోమవారం కదిరి నియోజకవర్గం జోగన్నపేటలో ఆ పార్టీ మండల నాయకులు కలిశారు. పాదయాత్రకు మద్దతిస్తూ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఐ టిడిపి మండల అధ్యక్షుడు పాపన మల్లికార్జున్‌రెడ్డి, గుర్రంపాటి హరినాథ్‌రెడ్డి, దాసరి శ్రీనివాసులు, గుర్రంపాటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఇఒ వీరారెడ్డి

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం


ప్రజాశక్తి - పులివెందుల టౌన్

బాల్య వివాహాలను నిర్మూలిద్దామని వక్తలు కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బాల్య వివాహాల నిర్మూలనకు బాలికలకు అవగాహన కార్యక్రమం సోమవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల (మెయిన్)లో నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎంఇఒ వీరారెడ్డి, ప్రముఖ దంత వైద్యురాలు డాక్టర్ హిమబిందు, ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్, స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షులు రాజు ప్రారంభించారు. ఎంఇ వీరారెడ్డి మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. ఆడుతూ, పాడుతూ ఉండాల్సిన వయసులో పెళ్లి చేయడం వల్ల వారు శారీరకంగా, మానసికంగా కుంగిపోతారని తెలిపారు. కుటుంబ బంధాలు దెబ్బ తినడం, అనారోగ్యానికి గురవుతారని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సేవా సమితి సభ్యులు హరీష్, రాఘవేంద్రరెడ్డి పాల్గొన్నారు.

నరేంద్రశర్మ సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి - చాపాడు

అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి దేవస్థానం వేదపండితులు నరేంద్ర శర్మ సేవలు ప్రశంసనీయమని పలువురు పేర్కొన్నారు. ఇటీవల జాతీయ స్థాయిలో సామవేద శిఖామణి బిరుదుతో కంకణం అందుకున్న నరేంద్రశర్మను సోమవారం రాష్ట్ర ఆర్యవైశ్య సభ ఉపాధ్యక్షులు దొంతు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పురోహితుడుగా అల్లాడుపల్లె దేవళాలులో నరేంద్ర శర్మ మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించారని కొనియాడారు. సర్ సివి రామన్ అకాడమీ వారు ఆయనను సన్మానించడం ఈ ప్రాంత ప్రజలకు సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖుల ఆధ్వర్యంలో నరేంద్ర శర్మ దంపతులతోపాటు ఆయన తల్లిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అల్లాడుపల్లె సర్పంచు కిషోర్‌కుమార్‌రెడ్డి, చిన్మయ మిషన్ రచన చైతన్య మాతాజీ, వేద పండితులు సత్యమూర్తి, విశ్రాంత తెలుగు పండితులు సాంబశివారెడ్డి, రామమునిరెడ్డి, సుబ్బరాయుడు, ఆలయ అర్చకులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.


నరేంద్రశర్మ కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న నిర్వాహకులు